# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన–1 15, అక్టోబరు, 2014

నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు ఇతర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల కోసం భూమిని సేకరించే క్రమంలో భూ నిర్వాసితులపట్ల అత్యంత మానవత్వంతో వ్యవహరించాలని, పునరావాస ప్యాకేజిని వీలైనంత తొందరగా అందించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరించాల్సిన భూ సేకరణ, పునరావాస చట్టంపై సచివాలయంలో బుధవారం సమీక్షా సమావేశం జరిగింది. ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి కె.తారకరామారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎస్కె.జోషి, రేమాండ్ పీటర్, ప్రదీప్ చంద్ర, ఆర్ఆర్ కమీషనర్ శ్రీదేవి, సిఎంఒ ముఖ్య కార్యదర్శి నర్సింగ్‌రావు తదితరులు ఈ సమావేశంలో పాల్గోన్నారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన భూ సేకరణ, పునరావాస చట్టాన్ని, వివిధ రాష్ట్రాలు భూ సేకరణ కోసం అమలు చేస్తున్న నిబంధనలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సమీక్షించారు. తెలంగాణకు అవసరమైన భూ సేకరణ చట్టాన్ని రూపొందించాలని, ఈ చట్టం భూమి కోల్పోయే వారికి ఆసరగా నిలబడాలని ముఖ్యమంత్రి చెప్పారు. మానేరు డ్యాం నిర్మించిన సందర్భంగా స్వయంగా తమ కుటుంబం కూడా ఎంతో విలువైన భూమిని కోల్పోయిందని, ఆ బాధ ఏలా వుంటుందో తనకు తెలుసని ముఖ్యమంత్రి అన్నారు. భూ నిర్వాసితులకు నష్ట పరిహారం అందించే విషయంలో ఉదారంగా వ్యవహరించాలని, మార్కెట్ రేట్లకు, రిజిష్ట్రేషన్ విలువకు చాలా తేడా వుంటుందని వెల్లడించారు. రిజిష్ట్రేషన్ విలువకన్నా ఎక్కువ మొత్తాన్ని భూ నిర్వాసితులకు ఇవ్వాలని ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. పట్టణ ప్రాంతాల్లో రిజిష్ట్రేషన్ విలువ కన్నా రెట్టింపు ధర, ఇతర ప్రాంతాల్లో ఒకటిన్నర రెట్ల విలువ, షెడ్యూల్డ్ ప్రాంతాల్లో రెండు రెట్ల విలువ ఇచ్చే ప్రతిపాదనను సమావేశంలో చర్చించారు. నీటి పారుదల ప్రాజెక్టులకు ఎక్కువ భూమి కావాల్సి వున్నందున ఎక్కువ మంది నిర్వాసితులు ఉంటారని,

వారందరి పునరావాసం కోసం అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. వీలైనంత వరకు భూ నిర్వాసితులతో చర్చలు జరిపి పరిహారాన్ని నిర్ధారించాలని, ఇందుకోసం రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి కమిటీలను నియమించాలని ముఖ్యమంత్రి చెప్పారు. భూ నిర్వాసితుల పరిహారానికి సంబంధించిన డబ్బులను ముందుగానే బ్యాంకులో డిపాజిట్ చేయాలని, పరిహారం కోసం నిర్వాసితులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే దుస్థితి రానీయవద్దని ముఖ్యమంత్రి చెప్పారు. ఒక్కో పరిశ్రమ స్థాపన కోసం గరిష్టంగా రెండు వేల ఎకరాలను సేకరించే విషయం, ఆహార భద్రతకు లోటు రాకుండా 15 శాతం లోపే వ్యవసాయ భూములను సేకరించే విధంగా చట్టం రూపొందించే అంశం చర్చకు వచ్చింది. ప్రభుత్వ ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలకు ఎట్టి పరిస్థితుల్లోను భూ సేకరణ తప్పదని, అదే సమయంలో భూ సేకరణ నిర్వాసితులకు శాపంగా మారరాదని చెప్పారు.

-----------------------------------------------------

సిపిఆర్ఓ టు సిఎం